ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
3
బుధవారం 17 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 25.0

జనం విలవిల

జగన్ బస్సు యాత్ర, సభకు పాట్లు

- మండుటెండకు అల్లాడిన ప్రజలు
- అడుగడుగునా ట్రాఫిక్ నిలిపివేత
- గంటల తరబడి వాహనదారుల అవస్థలు
- రోడ్లపై చెట్ల నరికివేత.. విద్యుత్ వైర్ల తొలగింపు.. సరఫరా నిలిపివేత
- ఆర్టీసీ బస్సులు భారీగా తరలింపు.. ప్రయాణికుల గగ్గోలు
- భీమవరం సభకు జనసమీకరణ కష్టాలు
- తణుకు మండలం తేతలిలో రాత్రి బస



ఉండిలో సీఎం బస్సు యాత్ర

నిడమర్రు/గణపవరం/ఉండి/భీమవరం క్రైం/ఇరగవరం/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 : మండు టెండలో జగన్ బస్సు యాత్ర ప్రజలకు చుక్కలు చూపించింది. జగన్ వస్తూ హాయ్ అని చెప్పుకొంటూ వెళ్లారు కానీ.. ఉదయం నుంచి వేచి చూసిన మాకు నరకం చూపించారని స్థానికులు, కిరాయి కార్యకర్తలు తిట్టుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపురం నుంచి మంగళవారం ఉదయం మొదలైన సీఎం జగన్ బస్సు యాత్ర నిడమర్రు, గణపవరం, ఉండి, భీమవరం, పెంటపాడు మండలం చిలకంపాడు లాకుల వద్ద, చింతపల్లి, రావిపాడు, ముదునూరు మీదుగా తణుకు మండలం తేతలి చేరుకుంది. నిడమర్రు మండలంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకారం రావాల్సి ఉండగా ఐదు గంటలు ఆలస్యంగా మండు వేసవిలో ఒంటి గంట సమయంలో జగన్ బస్సు నిడమర్రుకు చేరుకుంది. అప్పటి వరకు కార్యకర్తలు, నాయకులు మండుటెండను తట్టుకోలేక చెట్ల నీడలో, రోడ్డు పక్క షాపుల వరండాల్లో వేచి ఉంటూ ఇబ్బందులు పడ్డారు. జగన్ బస్సు యాత్ర పేరుతో రోడ్డుకు ఇరువైపులా వున్న చెట్లను నరికివేశారు. విద్యుత్ వైర్లను పూర్తిగా కట్ చేశారు. జగన్ యాత్ర వెళ్లాక మండుటెండలో విద్యుత్ సిబ్బంది వాటిని పునరుద్ధరించాల్సి వచ్చింది. ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిడమర్రు మండలంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇన్వర్టర్‌లు ఖాళీ కావడంతో ఫ్యాన్లు మొరాయించాయి. ఉదయం నుంచి విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో మోటార్లు పనిచేయక, నీటిసరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. ఐస్ ఫ్యాక్టరీల్లో ఐస్ పూర్తిగా కరిగిపోయి నష్టపోయారు. సీఎంకు దివ్యాంగులు తమ పెన్షను నెలకు నాలుగు వేలకు పెంచాలని, కొల్లేరు సమస్య పరిష్కరించాలని, న్యాయం చేయాలంటూ కొంత మంది నాయకులు వినతి పత్రాలు అందజేశారు. మందలపర్రులో జగన్ బస్సు దిగి ప్రజలకు అభివాదం చేశారు. భువనపల్లిలో వేచిచూసిన ప్రజానికానికి బస్సులో నుంచే హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గణపవరం మండల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సందిట్లో సడేమియా అన్న చందంగా జేబు దొంగలు పెట్రేగిపోయారు. పలువురు బాధితులు లబోదిబోమన్నారు. ఉండి మండలం ఆరేడు, పాందువ్వ రోడ్, కోలమూరు, ఉప్పులూరు రోడ్, పాములపర్రు, ఉండి ప్రధాన సెంటర్, ఎన్ఆర్పీ అగ్రహారం మీదుగా సాగింది. ఉండి సెంటర్‌లో జగన్ మాట్లాడతారని అంతా అనుకున్నప్పటికీ బస్సుపైకి ఎక్కి అభివాదం చేసుకుం టూ వెళ్లిపోవడంపై



నిడమర్రులో మండుటెండలో జనం



ఉండి : ఎండలో పోలీసుల పాట్లు

కార్యకర్తలు నిరాశ చెందారు. మండు టెండలో పలువురు రోగులు వినతిపత్రాలు అందించేందుకు ప్రయత్నించారు.

స్తంభించిన వాహనాలు

సీఎం బస్ యాత్ర, సిద్ధం సభల సందర్భంగా దారిపొడవునా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. భీమవరం బైపాస్ రోడ్డు, గరగపర్రు రోడ్డు, నర్సయ్య అగ్రహారం ప్రాంతాల్లో గంటలకొద్దీ వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. దూరప్రాంతాల నుంచి సభకు వచ్చిన వాహనాలతోపాటు, ప్రయాణికుల వాహనాలు నిలిచిపోయాయి. సభ అనంతరం సీఎం తాడేపల్లిగూడెం రోడ్డులో వెళుతున్న నేపథ్యంలో దానిని కొంతసేపు మూసివేశారు. సభ ప్రారంభం కాగానే వచ్చిన వారందరూ వెనుదిరిగారు. పోలీసులు చేసేదేమి లేక చేతులెత్తేశారు. రద్దీ ప్రాంతాలలో గణపవరం మండలం సరిపల్లె ప్రాంతానికి చెందిన వ్యక్తి కాలుపై నుంచి కారు వెళ్లడంతో అతడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఉండి మండలంలో ఉండి నుంచి భీమవరం వెళ్లే



ప్రసంగం ప్రారంభమైన

పావు గంటకే జనం తిరుగుముఖం

- సిద్ధం సభలో అధిక భాగం చంద్రబాబు, పవన్‌లపై విమర్శలకే జగన్ ప్రాధాన్యం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరంలో వైసీపీ నిర్వహించిన మేం సిద్ధం సభలో విమర్శలు గుప్పించేందుకే సీఎం జగన్ ప్రాధాన్యం ఇచ్చారు. సభలో తొలి పలుకు నుంచే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. సభకు జనాన్ని తరలించడానికి పార్టీ జిల్లా నేతలు ఆపసోపాలు పడ్డారు. డ్వాక్రా సీఏలను ఉపయోగించుకున్నారు. మహిళలను రప్పించారు. జనాన్ని బస్సుల్లో తరలించడంలో నేతలు ఒకింత కష్టపడ్డారు. కానీ సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వచ్చిన జనం తిరిగి వెళ్లిపోవడం కనిపించింది. అనుకున్న సమయంకంటే అరగంట ఆలస్యంగా సభ ప్రారంభమైంది. భీమవరం సిద్ధం సభా ప్రాంగణానికి సీఎం సాయంత్రం ఐదు గంటలకు చేరుకున్నారు. అప్పటికే సభా ప్రాంగణం భర్తీ అయిపోయింది. తొలుత భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. తర్వాత సీఎం ప్రసంగాన్ని ప్రారంభించారు. పావుగంట మాట్లాడేసరికి సభలో వున్న జనం తండోపతండాలుగా వెనక్కితిరిగి వెళ్లిపోయారు. కేవలం నాలుగు బ్లాకుల్లో మాత్రమే జనం ఉన్నారు. ఆయన ఉపన్యాసమంతా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపైనే సాగింది. వారివురిపైనా వ్యక్తిగత దూషణలకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాకు తాము ఏమి చేస్తాననేది చెప్పలేదు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేస్తామనే విషయాన్ని చెప్పలేదు. తాను రాకపోతే గడచిన 58 నెలల్లో అమలుచేసిన సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయంటూ చంద్రబాబుపై విమర్శనాస్త్రాలు సంధించారు. అబద్ధపు వాగ్దానాలతో ప్రజల ముందుకు చంద్రబాబు వస్తున్నారంటూ ఆరోపించారు. తాడేపల్లిగూడెం నుంచి మంత్రి కొట్టు సత్యనారాయణ పోటీ చేస్తున్నారని ప్రకటించడంతో ఇప్పటి వరకు ఈలి నానికి టిక్కెట్ ఇస్తారన్న ప్రచారానికి తెరపడింది.



సీఎం ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న జనం



భీమవరంలో నిలిచిన ట్రాఫిక్



పెంటపాడు మండలం చిలకంపాడు లాకుల వద్ద నిలిచిన ట్రాఫిక్‌లో వాహనదారుల ఇబ్బందులు



ఉండిలో నిలిచిన ట్రాఫిక్

రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పెంటపాడు మండలంలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసు ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం కాన్వాయ్ పెంటపాడు మండలంలోకి ప్రవేశించకముందే గంటకుపైగా వాహనదారులను చిలకంపాడు లాకుల వద్దే నిలిపివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేసవి వాతావరణం కావడంతో ద్విచక్రవాహనాలపై ఉన్న చిన్నారులు, గర్భిణీలు, మహిళలు నరకాన్ని చవిచూసారు. సీఎం కాన్వాయ్ చిలకంపాడు లాకుల మీదుగా కాశిపాడు మలుపు తిరిగేంత వరకు పోలీసులు వాహనదారులను ముందుకు సాగనివ్వలేదు.

సీఎం సభకు డబ్బులు ఇవ్వకుండా మోసం !

పాలకొల్లు : ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందాన తయారైంది వైసీపీ కార్యకర్తల పరిస్థితి.. భీమవరంలో జగన్ సభకు పాలకొల్లు, పరిసర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించడానికి వందలాది బస్సులు ఏర్పాటుచేశారు. కొన్ని బస్సుల్లో సీటుకు ఒక్కరే ఉండగా, మరి కొన్నింటిలో ఐదింట నాలుగో వంతు ఖాళీగా కనిపించాయి. సభకు తరలివెళ్లిన పలువురు తమకు డబ్బులు ముట్టలేదంటూ బహిరంగంగానే గగ్గోలు పెడుతున్నారు. తమను సమీకరించిన ప్రాంతానికి చెందిన కార్యకర్తలకు ఫోన్ చేసి సొమ్ములు ఇప్పించాలని ప్రాధేయ పడుతున్నారు. డబ్బులు ఇస్తే ఒక క్వార్టర్ కొనుక్కొని ఇంటికి వెళతాము. ఆలస్యమైతే బ్రాందీ షాపులు మూసివేస్తారంటూ ప్రాధేయ పడడం కనిపించింది. మండుటెండలో వెళ్లామని, సభకు వెళితే బిర్యాని ప్యాకెట్‌తో పాటు, ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.500 ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు తాము తిరిగి వచ్చి బస్సు దిగే సమయానికి పరారయ్యారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం క్వార్టర్ మందుకు డబ్బులు వస్తాయని, పని మానుకుని పార్టీ జెండా పట్టుకుని వెళితే చివరకు ఇంత పొడుగున చూపించారని ఒక భవన నిర్మాణ కార్మికుడు వాపోయాడు. జన సమీకరణలో సకాలంలో సొమ్ములు ఇవ్వకపోవడంతో పార్టీకి చెందిన పలువురు ఇబ్బందులు పడినట్టు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.



- సచివాలయం వద్దకే సిద్ధం బస్సులు

భీమవరంలో జరిగే సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించి సచివాలయాల వద్ద, సొసైటీల వద్ద, ఆర్‌బీకేల వద్ద ఉంచారు. పెంటపాడు మండలం కె.పెంటపాడులో సచివాలయం వద్ద సిద్ధం సభకు జనాన్ని తరలించే బస్సును ఉంచారు. ఎన్నికల కోడ్ సమయంలో సచివాలయం వద్ద ఒక పార్టీ కార్యక్రమానికి వెళ్లే బస్సులను ఎలా ఉంచుతారని విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై సచివాలయం అధికారులను వివరణ కోరగా బస్సులు ఇక్కడ పెట్టకూడదా అని వారు తిరిగి ప్రశ్నించారు.



- ఆలయానికి వైసీపీ జెండాలు

సీఎం బస్సు యాత్ర నేపథ్యంలో నాయకులు ఆలయాలను వదలలేదు. పెంటపాడు మండలం రావిపాడు సెంటర్‌లోని వినాయకుని ఆలయ గోడకు వైసీపీ జెండాలను కట్టేశారు.



- చెట్ల కొమ్మల తొలగింపు

చిలకంపాడు లాకుల వద్ద నుంచి కాశిపాడు, రావిపాడు గ్రామాల మీదుగా వెళ్తున్న రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించారు. చింతపల్లి గ్రామ సమీపంలో ఎంతోమందికి నీడనిచ్చే మర్రిచెట్టు కొమ్మలను నరికేశారు. చిలకంపాడు లాకుల నుంచి కాశిపాడు, రావిపాడు గ్రామాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేసేశారు.



తణుకు బస్టాండ్‌లో

- బస్సులు లేక ఇక్కట్లు

భీమవరంలో సీఎం జగన్ నిర్వహిస్తున్న సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు నాయకులు అపసోపాలు పడ్డారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా మండలం నుంచి సభకు వెళ్లేందుకు ప్రజలు సరిగా మక్కువ చూపలేదు. చాలా బస్సులు అంతంతమాత్రంగా జనాన్ని వేసుకుని ఖాళీగానే వెళ్లాయి. ఈ సభకు జనాన్ని తరలించేందుకు మొత్తం 939 బస్సులను వినియోగించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం డిపో నుంచి 45, నరసాపురం 30, తణుకు 40, తాడేపల్లిగూడెం 25 వెరసి మొత్తం 140 బస్సులు ఉన్నాయి. ఏలూరు జిల్లా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 100 బస్సులను వినియోగించారు. ఆర్టీసీ సర్వీసులను పెద్ద సంఖ్యలో రద్దు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓ వైపు శుభకార్యాలు ఉండడంతో బస్టాండ్‌లకు వచ్చి గంటల తరబడి నిరీక్షించారు. ఓ వైపు ఎండ వేడితో సతమతం అవుతూ.. ప్రయాణం సాగక పిల్లలు, మహిళలకు చుక్కలు కనిపించాయి. తణుకు బస్టాండులో వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. విద్యార్థులు తమ గృహాలకు చేరేందుకు అధిక ధరలు చెల్లించి ఆటోలను ఆశ్రయించారు.



సీఎం సభ నుంచి జనం తిరుగుముఖం



ఓటమి భయంతో.. జగన్ కొత్త నాటకం

- ఓటమి అంచున వైసీపీ
- ప్రజా మద్దతు మా వైపే..
- ఎన్‌డీఏ విజయం ఖాయం
- పోలవరంలో కూటమి ఉమ్మడి భేటీ..
- మీడియాతో పుట్టా మహేష్.. గన్ని



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మహేష్ యాదవ్, బాలరాజు, కూటమి నాయకులు

ఏలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'ఓడిపోతామనే భయంతో సీఎం జగన్ కొత్త నాటకం ప్రారంభించారు. కొత్త కథలు చెబుతున్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు నాట కాలు వేస్తున్నారు. ఇవన్నీ జగన్ గమనిస్తూనే ఉన్నారు. ఇలాంటి చేష్టలతో ప్రజలను వేమార్చలేరు. గత ఎన్నికల వేళ చిన్నాన్న హత్యను చంద్రబాబుపై నెట్టే ప్రయత్నం చేశారు. ఇలాంటి కట్టుకథలు ఇక చెల్లవు' అంటూ ఏలూరు ఎంపీ (టీడీపీ) స్థానం అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ధ్వజమెత్తారు. ఏలూరులో మంగళవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, పోలవరం నేతలతో కలసి ఉమ్మడి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'ఈ ఎన్నికల్లో రాళ్ల దాడి డ్రామాను ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్‌డీఏ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టు 75 శాతం పూర్తవ్వగా జగన్ ప్రభుత్వం ప్రాజెక్టును విస్మరించింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఎన్‌డీఏ గెలవాలి. పోలవరం ప్రాజెక్టుతో పాటు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసే బాధ్యతను తాము గెలిచిన తరువాత భుజానకెత్తుకుంటాం. యువతకు ఉద్యోగాలు, ప్రతీ నియోజకవర్గంలో పరిశ్రమలు తెస్తాను. ఆ మేరకు ఇప్పటికే సంప్రదింపులు చేస్తున్నాం' అని స్పష్టం చేశారు.

ఉమ్మడిగానే ముందుకెళతాం : గన్ని

పోలవరం నియోజకవర్గమే కాక అన్ని నియోజక వర్గాల్లోనూ కూటమి పార్టీలన్నీ ఉమ్మడిగా కలిసి పనిచేసి విజయం సాధిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. చిన్నచితకా వైరుధ్యాలు ఉన్నా పరిష్కరించామన్నారు. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం సహకారంతో ఇక్కడ గెలుపొందే కూటమి అభ్యర్థుల చొరవతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడం ఖాయమన్నారు. పోలవరం టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు తామంతా కలిసి మెలసి పని చేస్తామని, కూటమి విజయానికి కట్టుబడి ఉంటామన్నారు. పోలవరంలో కూటమి ఉమ్మడి సమావేశం నిర్వహించి ఏడు మండలాల్లో అత్యధిక మెజార్టీకి వీలుగా పకడ్బందీ వ్యూహం అమలు చేస్తామని వెల్లడించారు. వైసీపీ ఓటమి ఖాయమన్నారు. పోలవరం ఎమ్మెల్యే (జనసేన) అభ్యర్థి చిర్రి బాలరాజు మాట్లాడుతూ కూటమిలోని పార్టీల సహకారంతో, మద్దతుతో పోలవరంలో తాను, ఎంపీ స్థానంలో మహేష్ యాదవ్ గెలుపొందుతామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, జనసేన నేతలు అప్పల నాయుడు, రాఘవయ్య చౌదరి, పోలవరం టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 16 : వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై రాష్ట్ర సెక్రటరియేట్ నుంచి మంగళవారం జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ రాము, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల ఎస్ఈలు సత్య నారాయణ, సాల్మన్‌రాజు, కమిషనర్ వెంకటకృష్ణ, తది తరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 : ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడుల పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉంచినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు.



రాములోరి కల్యాణానికి జిల్లాలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ రామాలయాలతో పాటు వాడవాడలా సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తూర్పు యడవల్లి, చనుబండ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతున్నాయి.



చనుబండలో స్వామి, అమ్మవార్లు

నాడు గ్రూప్ 1 టాపర్.. నేడు సివిల్స్‌లో మెరిసిన ప్రత్యూష

ఏలూరు కలెక్టరేట్/కాళ్ల, ఏప్రిల్ 16 : జాతీయ స్థాయిలో జరిగిన సివిల్స్ పరీక్షల్లో పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలికి చెందిన గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష 198వ ర్యాంక్ సాధించి ఆదర్శంగా నిలిచింది. ఆమె గతేడాది గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి ప్రస్తుతం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. గణేశ్న వెంకట రామాంజనేయులు, ఉషా దంపతులకు ఏకైక సంతానం ప్రత్యూష. ఆమె మొదట నుంచి చదువుపై ఎంతో ఆసక్తి కనబరిచేది. ఉన్నత శిఖరాలు అందుకోవాలనే సంకల్పంతో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంక్ సాధించినట్టు తండ్రి రామాంజనేయులు తెలిపారు. ఈ ఏడాది జనవరి 15న ఢిల్లీలో ఇంటర్వ్యూలు జరిగాయి. తల్లి గృహిణి. తండ్రి వెంకట రామాంజనేయులు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రస్తుతం డీఈవో ఆఫీస్‌లో ఏపీవోగా పనిచేస్తున్నారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఈ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆమెను కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, డీఆర్వో డి.పుష్పమణి, సీసలి గ్రామస్థులు అభినందించారు.



భానుశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ

శ్రీవారి హుండీ ఆదాయం రూ 1.61 కోట్ల ఆదాయం



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: చిన్న తిరుమలేశునికి హుండీల లెక్కింపు ద్వారా గడచిన 17 రోజుల కాలానికి రూ.1.61 కోట్ల రూపా యల భారీ ఆదాయం సమ కూరింది.ప్రమోద కల్యాణ మండప ఆవరణలో మంగళ వారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన రూ.1,61,39,054 నగదుతో పాటు కానుకల రూపేణా 229 గ్రాముల బంగారం, 4.465 కేజీల వెండి లభించి నట్లు ఈవో త్రినాథ రావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (8), 1000(2), 2000 (19)తో పాటుగా పలుదేశాల కరెన్సీ సైతం లభించింది.

కుంకుళ్లమ్మకు లక్ష గాజులతో అలంకరణ



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: క్షేత్రదేవతగా విరా జిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండు వగా జరుగుతున్నాయి. లక్ష గాజుల అలం కరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమపూజలు చేశారు. గురువారం వరకూ జరుగనున్న ఉత్స వాల్లో భాగంగా గాజుల అలంకరణలో అమ్మ వారు నిండు ముత్తైదువులా భక్తులకు దర్శన మిస్తు న్నారు. ఈనెల 18న గురువారం ఆలయ ఆవరణలో మహిళలతో కుంకు మపూజ తర్వాత చండీహోమం జరుగు తుందని అర్చకులు భైరవస్వామి తెలిపారు.

వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరం టౌన్, ఏప్రిల్ 16 : వేసవిలో తాగునీరు, విద్యుత్తు సమస్యలు ఎదురవకుండా పటిష్టమైన ప్రణా ళికలను రూపొందించి అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. మంగళవారం విజయ వాడ వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసు కోవాలని, కాలువలు కట్టే లోపుగా పూర్తిస్థాయిలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచి నీటి, పశువులు చెరువులు నింపుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివా రణకు నిధులు అందుబాటులో ఉంచామని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్తు కోతలు,లో-వోల్టేజీ సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు జరిగేచోట కూలీలకు టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు,విద్యుత్‌శాఖ సహాయ సంచాలకులు పి.పద్మశ్రీ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలిస్తున్న జేసీ ఆదిత్య

సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరంటౌన్, ఏప్రిల్ 16 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, పోలింగ్ అయ్యిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలు తరలింపులో భాగంగా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను జిల్లా జాయింటు కలెక్టరు వివరించారు. ఈవీఎంలు, సెంట్రల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్‌లు, వీవీ ప్యాట్ల పంపిణీ, రూటు మ్యాప్ తదితర వాటిపై సెక్టార్ అధికా రులు, ఎంపీడీవోలు, ఉప తహసీల్దార్లకు జేసీ వివరించారు. సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, పోలింగు ముందు రోజు, పోలింగ్ జరిగిన అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఉండి నియోజక వర్గ నాలుగు మండలాలకు సంబంధించి అసిస్టెంటు రిటర్నింగు, సెక్టారు అధికారులు, ఎంపీడీవోలు, డీటీలు పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో ఎన్నికల అధికారుల తనిఖీలు

భీమవరం క్రైం, ఏప్రిల్ 16 : భీమవరం పట్టణంలోని రంగా బజార్‌లో ఉన్న ఒక ప్రముఖ బంగారు దుకాణంలో మంగళవారం ఎన్నికల అధికారులు తనిఖీలు చేశారు. ఎన్నికల సంబంధించి భారీ మొత్తంలో నగదు దుకాణంలో ఉందంటూ సమాచారం అందడంతో దాడులు చేసినట్లు తెలిసింది. ఉదయం నుంచే రెండు బృందాలుగా అధికారులు దాడులు చేశారు. అయితే నగదు ఒక లక్షా 30 వేలు, 500 ఫోటో ఫ్రేములు దొరకడంతో వాటిపై ఆరా తీస్తున్నారు. సరైన బిల్లులు చూపిం చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ దుకాణంలో నగదు మార్పిడి ఏమైనా జరిగిందా ? మరేదైనా కారణమా అన్నది తెలియాల్సి ఉంది.



పునుకొల్లు సమీపంలో కృష్ణా కాలువ గట్టుపై చెట్లకు నిప్పు పెట్టిన దృశ్యం

కృష్ణా కాలువ వెంబడి చెట్లకు నిప్పు

పెదపాడు, ఏప్రిల్ 16 : కొందరి ఆకతాయిల చేష్టలకు, కొందరి స్వార్థ ప్రయో జనాలకు పెట్టిన నిప్పుతో కృష్ణా కాలువ వెంబడి ఇరువైపులా గట్టుకు రక్షణగా వున్న పచ్చటి చెట్లు కాస్త అగ్ని ఆహుతవుతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు ఇటువంటి దుశ్చర్యలు ప్రతి ఏటా జరుగుతూనే వున్నాయి. కొంతమంది కాలువ గట్టుపై చెట్లు, తుప్పలకు నిప్పు పెట్టి కాలిపోయిన ప్రాంతంలోని కాలువ గట్టు మట్టిని రాత్రుళ్ల దొంగచాటుగా తవ్వి తీసుకెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అటు చెట్లకు, ఇటు కాలువ గట్టుకు నష్టం చేకూరేలా జరుగుతున్న చర్యలపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు దృష్టి సారించడంతో పాటుగా నిఘా పెట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



16-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	246	225	237.14
జంగారెడ్డిగూడెం-1	249	235	243.13
జంగారెడ్డిగూడెం-2	249	235	242.66
కొయ్యలగూడెం	249	235	242.91
గోపాలపురం	249	235	242.27

రాములోరి కల్యాణానికి వేళాయె..



తూర్పు యడవల్లి రామాలయానికి విద్యుద్దీపాలంకరణ

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 16: రాములోరి కల్యాణానికి వేళయింది. సీతా రాముల కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిళ్ళు వేశారు. దేవాలయాలను రంగులతో ముస్తాబు చేశారు. విద్యుద్దీపాల వెలుగులతో రామాలయాలు కాంతులీను తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాలైన చిన భద్రాద్రిగా పేరొందిన కామవరపు కోట మండలం ఈస్టు యడవల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయం, జంగారెడ్డిగూడెం సమీపంలోని గురవాయిగూడెం వద్ద మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, పెంటపాడు మండలం బైరాగిమఠం ఆలయం, చాట్రాయిలోని అపరభద్రాద్రిలో కలాణోత్సవాలకు శ్రీరామనవమి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామనవమి వేడుకలను కొన్ని ప్రాంతాల్లో మూడు రోజుల పాటు, కొన్ని ప్రాంతాల్లో ఐదు రోజులు, కొన్ని ప్రాంతాల్లో 9రోజులపాటు నిర్వహించాలని ఉత్సవ కమిటీలు నిర్ణయించాయి.



బైరాగి మఠం ఆలయం వద్ద చలువ పందిళ్లు

ముస్తాబైన బైరాగిమఠం గోపాలస్వామి

పెంటపాడు, ఏప్రిల్ 16 : శ్రీరామనవమి వేడుకలను పెంటపాడు మండ లంలోని కే.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి ఆలయం ముస్తాబైంది. స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఫిట్‌పర్సన్ రవిశంకర్ తెలిపారు. ఆలయం బయట, లోపలు చలువ పందిళ్ల వేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 17వ తేదీ బుధవారం సీతారామకళ్యాణ మహోత్సం జరగనుంది. కల్యాణం అనంతరం సుమారు 10 వేల మందికి పైగా భారీ అన్నసమారాధన చేయనున్నారు. అదే రోజు రాత్రి స్వామివారికి గ్రామోత్సవం జరపనున్నారు. 18వ తేదీ గురు వారం స్వామి రథోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుతారు. 19వతేదీ శుక్ర వారం ఆలయ సమీపంలోని కోనేరు వద్ద స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తారు. తెప్పోత్సవం జరిగే సమయంలో భారీ బాణసంచా కాల్చు తారు.బాణసంచా కాల్పులు వీక్షించేందుకు గ్రామం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా అధికసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. 20వ తేదీ శని వారం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముఖ్య అతిధులకు పూర్ణకుంభ స్వాగతం, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణం వద్ద అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



తూర్పు యడవల్లిలో విద్యుత్ దీపాల కాంతుల్లో పర్ణశాల

18న చినభద్రాద్రిలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16: చినభద్రాద్రిగా పేరొందిన తూర్పు యడవల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాములోరి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చినవెంకన్న ఆలయానికి దత్తత ఆలయం కావడంతో స్వామి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. ఉదయం 10-30 గంటలకు స్వామివారి కల్యాణం ప్రారంభిస్తామని తెలిపారు. 2003లో శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని అన్ని కైంకర్యాలను, ఉత్సవాలను నిర్వహిస్తూ అభివృద్ధి చేస్తున్నారు. గురు వారం ఉదయం 10 గంటలకు శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహి స్తామని ఈవో వివరించారు. ద్వారకా తిరుమలలో శ్రీవారి కల్యా ణంతో పాటు రాములోరి కల్యాణాన్ని బుధవారం ఉదయం నిత్యకల్యాణ మండప ఆవరణలో నిర్వహించనున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఉభయ దేవేరులతో స్వామివారు బుధవారం ఉదయం, సాయంత్రం తిరువీధుల్లో విహరిస్తారు. క్షేత్రంలో పలు ప్రాంతాల్లో రామాలయాలను, విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు.



ద్వారకా తిరుమలలో ఏర్పాట్లు



ఆకట్టుకున్న ఎదుర్కోలు ఉత్సవం

చాట్రాయి, ఏప్రిల్ 16: అపర భద్రాద్రిగా పేరొందిన చాట్రాయి మండలం చనుబండ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎదు ర్కోలు ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశ వరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జనక మహారాజు తరపున పెళ్ళి పెద్దలు, దశరథ మహారాజు తరపు పెళ్ళి పెద్దలు, సీతాదేవిని రాములవారిని తీసు కొని మంగళ వాయిద్యాలతో బయలుదేరి ఆర్యవైశ్య ప్రముఖుడు జల్లేపల్లి మురళీకృష్ణ ఇంటికి చేరుకొని సమావేశమయ్యారు.దశరథ మహారాజు తరపు పెద్దలు 'మా రామయ్య పురుషోత్తముడు, సుగుణాల సంపన్నుడు, సత్య వాక్కు పరిపాలకుడు.. అంత గొప్పవాడిని అల్లుడిగా పొందటం మీ అదృష్టం' అనగా, మా సీతమ్మ అందాలరాశి, సాక్షాత్ లక్ష్మీదేవి' అంటూ సీతారాముల గొప్పతనాన్ని చెప్పుకొచ్చారు. అనంతరం పెళ్ళి సంబంధం ఖాయం చేసుకొని లగ్నపత్రికలు మార్చుకున్నారు. ఈ మధుర ఘట్టాలను గ్రామస్థులు భక్తిభా వంతో తిలకించారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

సమావేశానికి రాలేదని వైసీపీ నాయకుల దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

చింతలపూడి, ఏప్రిల్ 16 : తెలుగుదేశం సానుభూతిపరుడు ఇంటిపై గత రాత్రి వైసీపీకి చెందిన కొందరు దాడి చేసి ఇంటి గోడను పలుగుతో పగలకొట్టి ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ బీసీ కాలనీలో ఉంటున్న కొనకళ్ల చిన్నారావు వద్దకు కొందరు వచ్చి "ఈనెల 14న వైసీపీ గౌడ కుల ఆత్మీయ సమావేశం జరుగు తుంది.." రావాలని కోరారు. కుదరకపోవడంతో చిన్నారావు సమావేశానికి వెళ్లలేదు. ఇది మనసులో పెట్టుకుని ఈనెల 15వ తేదీ రాత్రి చిన్నారావు ఇంటికి ముగ్గురు వ్యక్తులు వెళ్లి ప్రహరి గోడపై వివాదం పెట్టుకుని గోడను పలుగుతో కూల్చారు. ఈ సంఘటనతో కుటుంబం ఆందోళనకు గురైంది.దీనిపై చిన్నారావు భార్య స్వప్న తన భర్త లేని సమయంలో ఇంటికి చింతన యేసు, బాలిన చందు, బాలిన చరణ్ అనే ముగ్గురు వ్యక్తులు వచ్చి బూతులు తిడుతూ తమ ఇంటి గోడను పగలకొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మంగ ళవారం కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు నానాటికీ పెరుగుతున్నాయని, ఓటమి భయంతో అభద్రతా భావం చోటు చేసుకుని ఈ విధంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. చిన్నారావు కుటుం బానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16: కృష్ణా జిల్లా అండర్-18 జూనియర్ బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నూజివీడు బెతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు 80 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారని కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అ సోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు నూజివీడు టీఐఎస్ సీబీఎస్‌ఈ స్కూల్‌లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

రేపు కాపు ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 16: కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఈ నెల 18న కాపు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ తెలిపారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్స్లో నిర్వహించే సమావేశానికి వంగవీటి రాధా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం ముదినేపల్లి మండలం బొమ్మి నంపాడు గ్రామం నుంచి రాధాతో కలసి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.



ఉండి మండలం ఉప్పులూరులో మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి విగ్రహ ప్రారంభోత్సవంలో ఆయన కుటుంబ సభ్యులు

విలువలు కలిగిన నేత యర్రా నారాయణస్వామి

ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు

ఉండి, ఏప్రిల్ 16: మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి విలువలు కలిగిన నాయకుడు, అజాత శత్రువు అని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం ఉప్పులూరులోని యర్రా వ్యవసాయ క్షేత్రంలో ఆయన విగ్రహాన్ని యర్రా కుటుంబసభ్యులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాతగా, విద్యాదాతగా నారా యణస్వామి చిరకాలం గుర్తుంటారన్నారు. కార్యక్రమంలో నారాయణస్వామి కుమారులు సూర్యచంద్రరావు, శ్రీనివాస్ నవీన్‌లతో పాటు కుటుంబసభ్యులు, తాడేపల్లిగూడెం, తణుకు మాజీ ఎమ్మెల్యేలు పసల కనకసుందరరావు, ముళ్లపూడి వెంకటకృష్ణారావు, తాడేపల్లిగుడెం టీడీపీ ఇన్‌చార్జు వలవల బాబ్జి, చలసాని శ్రీనివాస్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, బెల్లంకొండ బుచ్చిబాబు తదితరుల పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న కళాకారుల సంఘ ప్రతినిధులు

ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 16: రంగస్థల కళాకారులకు తెలుగు నాటకరంగ దినోత్సవం ఒక పండుగ లాంటిదని హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో మంగళవారం రాత్రి కందుకూరి వీరేశలింగం జయంతి పురస్కరించుకుని కళాకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కళా సమ్మేళనం వైభవంగా జరిగింది. తొలుత జాహ్నవి లాలిత్య బృందం కూచిపూడి నృత్యం అలరించింది. అనంతరం పౌరాణిక నటులు కె.విజయ్‌భాస్కర్, దొంతేపల్లి అప్పారావులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఏలూరు గుత్తా ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో కళారంగానికి విశిష్టసేవలు అందించి ఆర్థికంగా వెనుకబడిన కళాకారులు కల్యాణ్, చంద్రమౌళి, ఎస్.సత్యనారాయణ, సీటీ కల్యాణిలకు ఆర్థిక సత్కారం అందించారు. కేవీ సత్యనారాయణ, వై.సోమ లింగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, పైడి బీమేశ్వరరావు, పురు షోత్తం, కె.సుబ్బారావు, ఖాజావలీ, గుత్తా పౌండేషన్ ప్రతినిధి పట్టాబి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటకంలో వారణాసి సీను ప్రేక్షకులను రంజింప చేసింది.

మే 11న జాతీయ లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో మే 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహి స్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో కార్యదర్శి రత్నప్రసాద్ విలేకరుల సమావేశంలో మంగళ వారం మాట్లాడారు. 2024 సంవత్సరంలో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించాల్సి ఉండగా మే 11న రెండో జాతీయ లోక్ అదాలత్ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గతంలో జిల్లాలో జరి గిన మొదటి లోక్ అదాలత్‌లో 1760 రాజీ పడిన కేసులు పరిష్కరించమన్నారు. జిల్లాలో 10 మండల న్యాయ సేవాధికార సంస్థలోనూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరుతో కలిసి 11 చోట్ల ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీ కేసులకు సంబంధించి సందేహాలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. అవసరమైతే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి కేసును రాజీ చేస్తామన్నారు. ఎవరైనా న్యాయ సహాయం కావాలనుకుంటే 08812-224555 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కలిదిండి మండలంలో అడుగంటిన పోలరాజ్ కెనాల్

తాగునీటి గండం!

అడుగంటిన పోలరాజ్ కెనాల్...శివారు గ్రామాలకు అందని నీరు

కలిదిండి, ఏప్రిల్ 16 : కలిదిండి మండలంలో పోలరాజ్ కెనాల్‌కు అర కొరగా తాగునీరు విడుదల చేయడంతో అడుగంటింది. సుమారు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఇంతవరకు పోలరాజ్ కెనాల్‌కు తాగునీరు సరఫరా కాలేదు. దీంతో తాగునీటి చెరువులను ఏ విధంగా నింపుకోవాలని సర్పం చ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాగునీటి ఎద్దడి తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతెగలపాడు, కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాల్లో తాగునీటి చెరు వులను నింపుకోవడానికి తాగునీటి వంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 10న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కలిదిండి సందర్శించి ఆరుతెగలపాడు వద్ద అడుగంటిన పోలరాజ్ కెనాల్‌ను పరిశీలించారు. పోలరాజ్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసి ఆయా గ్రామాల్లో అడుగంటిన చెరు వులను నింపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినా ఇంత వరకు అరకొరగా సరఫరా చేయడంతో శివారు గ్రామాలకు నీరు చేరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి సమృద్ధిగా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

గడ్డి మంటల్లో యువకుడి మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగబాబు

ఆకివీడు రూరల్, ఏప్రిల్ 16 : ఆకివీడు మండలం పెద కాపవరం శివారులో గడ్డిమేటు మంటల్లో యువకుడు మృతి చెందాడు.నిడమర్రు మండలం బావాయి పాలెనికి చెందిన గొర్రెల దుర్గారావు (28) పెట్రోల్ పోసు కుని అంటించుకుని గడ్డివాములోకి వెళ్లాడని దీంతో అగ్నికి ఆహుతై మృతి చెందినట్లుగా పోలీ సులు తెలిపారు. మృతుడు కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడతు న్నట్లుగా తెలియవచ్చింది. ఎస్ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

కలుపు మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

పోలవరం, ఏప్రిల్ 16 : కలుపు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ రేపల్లె వాడలో మంగళవారం జరిగింది. రేపల్లెవాడ గ్రామానికి చెందిన కాపా

క్రైం కార్నర్

పోశీరావు కలుపు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో బంధువులు అతడిని పోలవరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనం తరం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఆత్మహత్యా యత్నానికి కారణాలు తెలియవలసి ఉందని పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీకి గాయాలు

పోలవరం, ఏప్రిల్ 16 : పోలవరం మండలం జిల్లెల్లగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి విద్యుత్ షాక్‌కి గురై వ్యవసాయ కూలీ గాయపడ్డాడు. జిల్లెల్లగూడెం గ్రామానికి చెందిన శివరామకృష్ణారెడ్డి తన పొలంలో పని చేసుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడని చికిత్స నిమిత్తం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడి నుంచి మెరు గైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించినట్లు పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహానికి పోస్టుమార్టం

పోలవరం, ఏప్రిల్ 16 : పోలవరం మండలం గూటాల పంచాయతీ కొండ్రుపీది గోదావరి నది రేవులో నాలుగు రోజుల క్రితం లభ్యమైన మృత దేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మృతుని వివరాలు తెలియవలసి ఉందని తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 : ఒక యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాలు జైలు శిక్ష, రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు సెషన్స్ జడ్జి, మహిళా కోర్టు జిల్లా న్యాయాధికారి రాజేశ్వరి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఆగస్టు 20 తెల్లవారు జామున పెదపాడు మండలం పాతముప్పర్రులో నివాసం ఉంటున్న అమ్మమ్మ తాతయ్యలు ఆసుపత్రి నిమిత్తం విజయవాడ వెళ్లగా ఆ ఇంట్లో వారి మను మరాలు ఒక్కతే ఉంది. అదే రోజు ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై పాతముప్పర్రు గ్రామానికి చెందిన సాకా శివ (25) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పెదపాడు పోలీసులకు ఫిర్యాదు అందడంతో అప్పటి పెదపాడు ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ అనసూరి శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రెండు వేలు జరిమానా విధిస్తూ జడ్జి రాజేశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామాంజ నేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు పెదవేగి సీఐ శ్రీనివాసకుమార్, పెదపాడు ఎస్ఐ శుభశేఖర్, కోర్టు కానిస్టేబుల్ పవన్ కుమార్‌లు సహకరించారు. సకాలంలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి ప్రాసి క్యూషన్‌కు సహకరించిన పెదవేగి సీఐ, పెదపాడు ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రశాంతి అభినందించారు.

కూటమిదే విజయం : బడేటి చంటి



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 16: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి ధీమా వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 31, 32, సాయంత్రం 13, 14 డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. అనంతరం చంటి మాట్లాడుతూ ప్రజాస్పందన చూస్తుంటే వైసీపీ కనుమరగవడం ఖాయమనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాని స్వార్థం కారణంగా ఏలూరు జూట్‌మిల్లు మూతపడిందని తద్వారా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మరలా ఇప్పుడు కొత్తూరు జూట్ మిల్లు మూసివేత కారణంగా 3వేల కుటుంబాలు, కార్మికులు ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు జూట్‌మిల్లులను తెరిపిస్తామని అన్నారు. జగన్ పాలనలో ఆర్థిక అత్యయిక పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే ప్రజలకు బతుకుతెరువు ఉంటుందన్నారు. విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఇడా మాజీ చైర్మన్ ఎంఆర్‌డీ బలరామ్, పృథ్వీశారద, రవి, తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో ప్రచారం చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

నియోజకవర్గ ఉన్నతికి కృషి : పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు/భీమడోలు, ఏప్రిల్ 16: నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఉన్నతికి కృషి చేస్తానని నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు మండలం కైకరం శివారు రామన్నగూడెం, వెంకట కృష్ణాపురం, భీమడోలు మండలం సాయన్నపాలెం గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల తాగునీటి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు అన్ని వర్గాల వారికి విద్య, వైద్యం అందించడమే కూటమి ప్రధాన ధ్యేయమన్నారు. భీమడోలు, వడ్లపట్ల, సాయన్నపాలెంలో ధర్మరాజుతోపాటు ఉమ్మడి పార్టీ నేతలు ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఘంటసాల తిరుపతిరావు, సర్పంచ్ సలగాల గోపి, చింతల శ్రీను, నియోజకవర్గ పరిశీలకులు వట్టి పవన్‌కుమార్, సిరిబత్తుల కృష్ణమోహన్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి : రోషన్



పథకాలు వివరిస్తున్న సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, ఏప్రిల్ 16 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. వెంకటాపురంలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి అధికారంలోకి వస్తే మహిళలు, బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, బీసీలకు అమలు చేసే పథకాలను వివరించారు. రాష్ట్రాన్ని చంద్రబాబు నేతృత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపిస్తారని రోషన్ అన్నారు. వెంకటాపురం ఏరియాలో రోడ్ల పరిస్థితిపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాను గెలిస్తే మీ రోడ్డు నిర్మాణం బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం జయహో బీసీ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో వైసీపీకి చెందిన కోలా వెంకటేశ్వరరావు, మరో 50 మంది పార్టీలో చేరడంతో కండువాయి కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, సూరానేని గోపి, కక్కిరాల ఉపేంద్ర, డి.వెంకటేశ్వరరావు, అప్పన్నదొర, మధుబాబు, కె.నాగవిజయ్‌కుమార్, మిద్దే సత్యనారాయణ, తాటి అప్పారావు, పలువురు పాల్గొనగా గ్రామంలో రోషన్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు.

విద్యార్థుల నమోదు పెంచేందుకు కార్యాచరణ : డీవైఈవో



డీవైఈవోగా బాధ్యతలు చేపట్టిన రవిప్రకాష్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16: ఏలూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన అల్లూరి రవిప్రకాష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల అమలుకు కృషిచేస్తానన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను మరింతగా పెంచడానికి కార్యాచరణ అమలు చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించి నూతన విద్యా సంవత్సరం నుంచి లోటుపాట్లను అధిగమించేందుకు ఉపాధ్యాయులందరికీ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. సకాలంలో విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల్లో ఎంఈవోలందరినీ సమన్వయపరుచుకుని క్షేత్రస్థాయిలో పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తామన్నారు. తొలుత డీఈవో అబ్రహంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం సత్రంపాడు జడ్పీ పాఠశాలను సందర్శించి పరీక్షల నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసినవారిలో ఏలూరు ఎంఈవో-2 రంగయ్య, వంశీ, కృష్ణారావు, పద్మశ్రీ, రాంబాబు, సుమలత తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలుపై వ్యవసాయాధికారి పరిశీలన



కైకరం ఆర్బీకేలో జేడీ షేక్ హబీబ్ బాషా

ఉంగుటూరు, ఏప్రిల్ 16: తేమ శాతం నిబంధనపై రైతులు జాగ్రత్తలు తీసుకుని ప్రయోజనాన్నిపొందాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా కోరారు. ఉంగుటూరు మండలం కైకరం రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ఈ సీజన్‌లో సంచులు, లారీల సమస్య ఉండదని, రైతులు రైతు భరోసా కేంద్రంలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట భీమడోలు ఏడీఏ రాజకుమారి, ఏవో బాలిన వెంకటేశ్, ఎన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఏలూరు విద్యార్థులు

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 16: సిద్ధార్థ స్కూలులో ఏలూరు జిల్లా అడహాక్ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి అండర్ 17 బాలుర, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 43 మంది క్రీడాకారులు పాల్గొనగా బాలురు విభాగంలో యోగి, నవదీప్ ప్రథమ, ద్వితీయ, బాలికల విభాగంలో కార్తీక్, సుచిత్ర ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారు ఈ నెల 20, 21 తేదీలలో రాష్ట్ర స్థాయి అండర్ 17 చెస్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అడహాక్ కమిటీ కన్వీనర్ వాసుదేవరావు, కో కన్వీనర్ శిరిగినీడి కోటేశ్వరరావు తెలిపారు. సిద్ధార్థ క్విస్ట్ స్కూలు డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తి వచ్చేందుకు చెస్ పోటీలు దోహదపడతాయన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాదాసు కిషోర్, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16: ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పలువురు టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. పరీక్షలకు 83మంది విద్యార్థులు హాజరుకాగా 65మంది (78శాతం) ఉత్తీర్ణులయ్యారని వివరించారు. టాపర్లను అభినందించారు.

కందుకూరి వీరేశలింగం బాటలో నడుద్దాం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16: కందుకూరి వీరేశలింగం జీవితం-సాహిత్యం అనే అంశంపై మంగళవారం సీఆర్‌ఆర్ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఉపన్యాస కార్యక్రమం జరిగింది. కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు కందుకూరి బాటలో నడవాలని సూచించారు. తెలుగు హెచ్‌వోడీ మేడసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కందుకూరి మహిళల అభ్యున్నతికిచేసిన కృషిని వివరించారు. కరస్పాండెంట్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, అధ్యాపకులు శంకర్, రవికుమార్, ఇమ్మానియేల్, ఫణికుమార్, శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



కైకలూరులో గౌడ సంఘ ఆత్మీయ సమావేశంలో పుట్టా మహేష్ యాదవ్

రైతుకు నీరు.. యువతకు ఉద్యోగం

- మా లక్ష్యాలు, ఆకాంక్షలు ఇవే..
- అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యం
- మీలో ఒకడిగా నేను..
- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ వినూత్నశైలి

ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఏప్రిల్ 16: రాజకీయాలకు కొత్త అయినా వ్యవహార శైలిలో మాత్రం సరికొత్త ఒరవడితో టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థిగా అందరి సహకారం, సరికొత్త ఎత్తుగడలతో మహేష్ యాదవ్ ప్రజల వద్దకు వెళుతున్నారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యలను నేరుగా పరిగణనలోనికి తీసుకుని ఎక్కడైతే సమస్య ఉందో గుర్తించి సంబంధికులతో నేరుగా భేటీ అవుతున్నారు. వారి సలహాలు సూచనలతో పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో ఆత్మీయ సమావేశాలు, సామాజిక సమావేశాలు, రైతు సమస్యలపై చర్చలు సాగించారు. ఆయా సమస్యలపై చురుకైన పనితనంతో మహేష్ యాదవ్ సమయానుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఏలూరు లోక్ సభ నియోజకవర్గం నుంచి తొలి సారిగా పోటీ చేస్తున్న ఆయన ఈ రెండు వారాల్లో మెరుగైన అవగాహన తెచ్చుకున్నారు. దీనికి అనుగుణంగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి వీలుగానే ఇంతకుముందు ఈ ప్రాజెక్టు పరిధిలో తానుకొంత చేయూతనిచ్చిన విషయం గమనించి ఆమేరకే ఏలూరు ఎంపీగా రంగంలో దింపిన విషయాన్ని ఆయన పదే పదే గుర్తు చేస్తున్నారు. సమస్యలపై అవగాహన ఉంది.. పరిష్కారంకోసం అన్వేషించే ధైర్యం ఉంది. సంకల్ప సిద్ధిలో అనుభవం ఉంది. ఇక ప్రజల తోడ్పాటు ఉంటే తాను తిరుగులేని అభివృద్ధి చేసి చూపిస్తాననే ధీమాతోనే మహేష్ యాదవ్ ఉన్నట్లు ఆయన అనుచరులు, పార్టీ వర్గాలు ప్రజలకు వివరించే పనిలో పడ్డాయి. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో 2 అసెంబ్లీ స్థానాలు జనసేనకు, ఒకటి బీజేపీకి కేటాయించడంతో అందరికీ స్నేహితుడిగా పదునైన రాజకీయాలకు వ్యూహాలు పన్నుతున్నారు. ఇన్‌ఫ్రా కంపెని బాధ్యతలతో తన కొంత రాటుదేలినట్లు, సమాంతరంగా అనుభవం సాధించినట్లు పోలవరం, చింతలపూడి, ఎత్తిపోతల పథకంలో ఈ అనుభవం తనకు నూరుశాతం స్ఫూర్తిదాయకమని యాదవ్ భావించారు. ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యలను ప్రస్తావిస్తూ ఏలూరు ఎంపీ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సరికొత్త పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టారు. ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో ముఖ్యులు, స్నేహితుల సహకారంతో పరిశ్రమలు తీసుకువస్తానని, తద్వారా ఉద్యోగాల కొరత తీరుస్తానని ఇప్పటికే ఆయన ధీమాతో ఉన్నారు. ప్రత్యేకించి మెట్ట ప్రాంత రైతులకు సాగునీటి కల్పనలో తనను గెలిపిస్తే సాగునీరు, అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నదే ఆయన మాటగా వినిపిస్తుంది. ఇదే విషయాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూడా నేరుగా ప్రస్తావిస్తున్నాయి.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



బాపిరాజుగూడెంలో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న నేతలు

పెదవేగి, ఏప్రిల్ 16: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ అన్నారు. బాపిరాజుగూడెంలో మంగళవారం టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఒక్కఛాన్స్ అంటూ జగన్‌రెడ్డి మోసపూరిత మాటలకు జనం ఓట్లేసి గెలిపించారని, ప్రస్తుత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ జోగి పెద పెంటయ్య, మద్దాల సహదేవుడు, పార్టీ నాయకులు బొప్పన మార్కండేయులు, తలకొండ జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని 16వ వార్డులో టీడీపీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంట వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని భరోసా ఇచ్చారు. కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, నాయకులు పెనుమర్తి రామకుమార్, మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, తూటికుంట దుర్గారావు, చింతల వెంకటరమణ, పగడం సౌభాగ్యవతి. గుళ్లపూడి శ్రీదేవి, పరిమి సత్తిపండు, చిట్రోజి తాతాజీ, తూటికుంట రాము, షేక్ పీరు, బుల్లియ, కంపా రాజేంద్ర, చేను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి విభిన్న ప్రతిభావంతుల మద్దతు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 16: రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వెంటే ఉన్నారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి చైర్మన్ కోటేశ్వరరావు అన్నారు. సమితి కార్యాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి, పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న 23 అంశాలను చంద్రబాబు మేనిఫెస్టోలో చేర్చారన్నారు. అధికారంలోకి రాగానే దివ్యాంగుల ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సామాజిక పింఛన్ రూ.6వేలు, 5శాతం రాజకీయ రిజర్వేషన్లు, ప్రతీ దివ్యాంగులకు 3 సెంట్ల స్థలం, పక్కా ఇళ్ల నిర్మాణం చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్, బయ్యారపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను గమనించాలి

లింగపాలెం, ఏప్రిల్ 16: ఎన్నికల సందర్భంగా వైసీపీ అరాచకాలను గమనించాలని టీడీపీ శ్రేణులకు నాయకులు సూచించారు. లింగపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, గుత్తా సత్యసాయివరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలుగుదేశంపార్టీ హయాంలో సంక్షేమ పథకాలను ప్రతిగడపకు తీసుకువెళ్ళాలని కోరారు. వైసీపీ నాయకులు మద్యం, డబ్బుతో ప్రజలను కొనాలనే దురాలోచనతో ఉందని, దానికి అడ్డుకట్ట వేయాలన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ గెలవడం ఎంతో అవసరమని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించుకోవాలని, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, రాయంకుల చక్రధరరావు, బొంతు రాంబాబు, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, మోరంపూడి ప్రసాద్, రామ్మోహన్‌రావు, మహేష్‌బాబు, విజయ్, టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నారాయణపురం హైస్కూలులో ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న ఆర్వో, ఆర్డీవో ఖాజావలి, టి.నరసాపురంలో మాట్లాడుతున్న ఏఆర్వో సుభాష్

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి : ఆర్వో

ఉంగుటూరు, ఏప్రిల్ 16: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఖాజావలి అన్నారు. నారాయణపురం ఉన్నత పాఠశాలలో అదనపు పోలింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సమయంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిక్షణలో తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, డీటీ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, రిసోర్స్ పర్సన్స్‌గా శిరిమామిళ్ల పెద్దిరాజు, శీతాల సత్యనారాయణ, హరికృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● టినరసాపురం: పోలింగ్ సిబ్బంది విధులపై అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పోలింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోలింగ్ సిబ్బంది వ్యవహరించాల్సిన, తీసుకోవలసిన జాగ్రత్తలు, విధి విధానాలు, నిబంధనలపై మాస్టర్ ట్రైనీ జి.లక్ష్మణరావు వివరించారు. సమయపాలన పాటించాలన్నారు. మండలంలో 206 మందికి శిక్షణ ఇచ్చారు.

పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జేసీ

పెదపాడు: ఎన్నికల్లో సమయంలో పోలింగ్ అధికారులు, సహాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేసీ, నియోజకవర్గ ఆర్వో బి.లావణ్యవేణి సూచించారు. పెదపాడు మండలం వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

బుట్టాయగూడెం: సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని ఐటీడీఏ పీవో, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ మంగళవారం తెలిపారు. 18న ఎన్నికలపై ప్రకటన వెలువడుతుందని, అదే రోజు నుంచి 25 వరకు ఐటీడీఏ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్‌వో చాంబర్‌కు అనుమతిస్తామని, మూడు వాహనాలకు మాత్రమే ఆర్‌వో ఆఫీసుకు 100 మీటర్ల వరకు అనుమతి ఉంటుందని తెలిపారు.



ఏలూరు బావిశెట్టివారిపేట కోదండరామాలయం, కల్యాణ ముస్తాబులో స్వామి వారు, జీలుగుమిల్లిలో స్వామి, అమ్మవార్లను అలంకరించిన మహిళలు

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16: శ్రీరామనవమికి నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారామ కల్యాణ మహోత్సవాలు, శ్రీరామపట్టాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఆలయాలవద్ద సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఆలయాలను రంగుల తోరణాలు, విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు. భక్తులకు పానకం, వడపప్పు అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దక్షిణపువీధి, నరసింహరావుపేట, పవర్‌పేట, గులాబీతోట, అమీనాపేట, ఎంఆర్‌ఆర్ కాలని, అశోక్‌నగర్, విద్యుత్‌నగర్ సత్యనారాయణపేట, బావిశెట్టివారిపేట, పాతబస్టాండ్ సెంటర్, అగ్రహారం, శివయ్య గుడిసెంటర్, ఆదివారపేట ప్రాంతాలన్నీ కళకళలాడుతున్నాయి

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాలలో రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలవద్ద సీతారామ కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కామవరపుకోట, కొత్తూరు, పాతూరు, ఆడమిల్లి, తడికలపూడి, జీలకర్రగూడెం, గుంటుపల్లి, కె.ఎస్.రామవరం, కళ్ళచెర్వు, గండిగూడెం, రావికంపాడు, యడవల్లి, రామన్నపాలెం ఆలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి.

● జీలుగుమిల్లి: శ్రీరామ నవమి వేడుక పురస్కరించుకుని జీలుగుమిల్లి కోదండ రామాలయంలో రెండు రోజులుగా ఉదయం సాయంత్రం హోమాలు, ప్రత్యేక పూజలు అర్చకులు తనికెళ్ల రామకృష్ణశర్మ, సర్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. మంగళవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు శాస్త్రోకంగా రుత్వికుల ద్వారా మహిళలు నిర్వహించారు. అనంతరం సీతారాములను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం మహిళలు ఆలయం వద్ద మోహంది ఉత్సవం, భజన కార్యక్రమాలు చేశారు.

● జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీతారామ స్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, తోరణం, పెండ్లి కుమారుని చేట, పసుపు కొట్టుట వంటి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరనుందని ఆలయ అర్చకులు తెలిపారు.

వైభవంగా సీతారామ ఆలయం ప్రతిష్ఠ

కుక్కునూరు: మండల పరిధిలోని దామరచర్లలో వైభవంగా లక్ష్మణ సమేత సీతారామాంజనేయ ఆలయ ప్రతిష్ఠ జరిగింది. ధ్వజస్థంభం ముత్యాలమ్మ నాభిశిల ప్రతిష్ఠ జరిగింది. మండలంలోని అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు భోనాలతో ఆలయానికి చేరుకుని పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దాదాపు 2 వేల మంది భక్తులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



తిరుమలాపురం జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న దాసరి శేషు

బీసీల అజెండా.. టీడీపీ జెండా

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 16: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. తిరుమలాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు బూసా సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో బీసీల అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కి పోయిందన్నారు. బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ రూ.75వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని, టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే కార్పొరేషన్లు పునరుద్ధరించి వచ్చే ఐదేళ్లలో రూ.150లక్షల కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. యాగంటి సుబ్రహ్మణ్యం, వెలగల సత్యనారాయణ యాదవ్, రాగాని రామకృష్ణ, మండవ లక్ష్మణరావు, శీలం వెంకటేశ్వరావు, ఆకుల రాకేష్, పులి శివ, పోలోతు ఆంజనేయులు, మరీదు వెంకటేశ్వరరావు, చిత్రోజు తాతాజీ, ఉమా మహేశ్వరి, కెఎల్.ఆనందకుమార్, గొల్లమండల శ్రీనివాస్, ఎలికే ప్రసాద్, గోలి అనిల్, లింగాల సత్యనారాయణ, ముళ్ళపూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కొల్లివారిగూడెం జయహో బీసీ సదస్సులో నేతల సంఘీభావం

కూటమి విజయంతో బీసీల రక్షణ చట్టం

కామవరపుకోట, ఏప్రిల్ 16: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని, అనంతరం బీసీల రక్షణ చట్టం అమలులోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. గుంటుపల్లి పంచాయితీ కొల్లివారి గూడెంలో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సుకు టీడీపీ నాయకులు బేతిన వెంకట్రావు అధ్యక్షత వహించారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నియంతగా పరిపాలిస్తున్న జగన్‌ను గద్దె దింపాలన్నారు. పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, గోరింకదాసు, జుజ్జూరి బాబ్జి, ఘంటా సుధీర్‌బాబు, కంఠమనేని అంజిమూర్తి, పుష్పరాజ్యం, రేగుంట సురేష్, జోలా విజయ్, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నుంచి నాగళ్ళ రాంబాబు మిత్రబృందం దాదాపు 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఘంటా మురళి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి



ఐక్యత చాటుతున్న కాంగ్రెస్, వామపక్ష నేతలు

చింతలపూడి, ఏప్రిల్ 16: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా, జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు కోరారు. స్థానిక కాంగ్రెసు కార్యాలయంలో పార్టీలోకి చేరిన మహిళలను స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వస్తే అందించే పథకాలను వివరించారు. అనంతరం చింతలపూడి పట్టణంలో ప్రచార ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సుందరరావు, అలగా రవికుమార్, ప్రసాద్, పెద్దిరాజు, సత్యనారాయణ, టి.బాబు, కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం, ఏప్రిల్ 16: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ములగలంపాడులో మంగళవారం ఎలీజా ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్‌పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎలీజా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అరాచకపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. అందుకే వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. కార్యకర్తలను వైసీపీ నాయకత్వం పట్టించుకోదని అన్నారు. ములగలం పాడు గ్రామంలో ఆయన ప్రచారం నిర్వహించారు. మాల మహానాడు ప్రధాన కార్యదర్శి సరిపెల్లి పెద్దిరాజు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

పెదవేగి, ఏప్రిల్ 16: దెందులూరు నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 18న తన నామినేషన్‌ను దాఖలు చేస్తున్నట్లు ఆలపాటి నరసింహమూర్తి తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సరుకులు

కుక్కునూరు, ఏప్రిల్ 16: మండలంలోని మారుమూల అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సరుకులు వెళ్లేలా చర్యలు తీసకుంటామని సీడీపీవో ఎస్.లక్ష్మీకుమారి అన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. మారుమూల ప్రాంతంలో అంగన్‌వాడీలకు రవాణ సౌకర్యాలు లేకపోవడంతో సమీప కేంద్రాల్లో స్టాక్ పెడుతున్నామన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ద్విచక్ర వాహనాలపై సరుకులను ఎప్పటికప్పుడు తరలిస్తామన్నారు. రవాణా ఖర్చు విషయంపై ప్రభుత్వం అందించేలా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేస్తామన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు, ఏప్రిల్ 16: పెదపాడు సెక్షన్ పరిధిలో 11 కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ విద్యుత్ లైన్ల నిర్మాణం, మరమ్మతు పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నారు. ఈనెల 18, 19, 20వ తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లుగా ఏఈ వై.రాంబాబు మంగళవారం తెలిపారు. రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ పరిధిలో గల ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, రాళ్లపల్లివారిపాలెం గ్రామాల ప్రజలు విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని కోరారు.

● ఉంగుటూరు: పెదతాడేపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నాయని యర్రమళ్ళ, చేబ్రోలు సబ్‌స్టేషన్‌లలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ జేపీజీనటరాజన్ తెలిపారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నారాయణపురం, బాదంపూడి సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

1872 ఎకరాల్లో వరిసాగు

పెదపాడు, ఏప్రిల్ 16: మండలంలో రబీ సీజన్‌లో 1872 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని ఏవో వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 498 ఎకరాల్లో వరికోతలు పూర్తికాగా, ఇప్పటి వరకు 263 టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని ఏవో ప్రదీప్‌కుమార్ చెప్పారు.

కృష్ణాపురంలో కూరగాయలు పంపిణీ

టి.నరసాపురం, ఏప్రిల్ 16: కృష్ణాపురంలో భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా వేణుగోపాల్ నాయక్ తనయుడు పుట్టినరోజు సందర్భంగా 50 కుటుంబాలకు జరబల పూర్ణయ్య మంగళవారం కూరగాయలు పంపిణీ చేశారు. సక్రమ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వేణు గోపాల్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇతరులకు సహాయం చేయడం నిజమైన మానవత్వం అన్నారు. కార్యక్రమంలో భూక్యా ధనలక్ష్మి, తేజావత్ చంద్రశేఖర్, జరబల సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

22 మంది వలంటీర్ల రాజీనామా

ఉంగుటూరు, ఏప్రిల్ 16: ఉంగుటూరు మండలంలో మంగళవారం 22మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కైకరంలో 13 మంది, కాగుపాడులో 9 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శర్మ తెలిపారు.


చనుబండలో ముస్తాబైన అపర భద్రాద్రి




విద్యుద్దీపాలంకరణలో ముసునూరు కోదండ రామాలయం



సీతారాముల కల్యాణం చూతము రారండి..

శ్రీరామ నవమికి ఆలయాల్లో ఏర్పాట్లు

ముసునూరు, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకలకు మండల వ్యాప్తంగా రామాలయాలు ముస్తాబయ్యాయి. ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి, లోపూడి, గుడిపాడు, గోపవరం, వేల్పుచర్ల, కొర్లకుంట తదితర గ్రామాల్లోని రామాలయాలకు రంగులు వేసి, విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్ళు వేశారు. బుధవారం సీతారామ కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధనలకు సిద్ధం చేశారు.

కలిదిండి: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. అపర భద్రాద్రి తాడినాడ రామాలయం ఆవరణంలో చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. రాములోరి కల్యాణం వీక్షించటానికి భక్తులకు ఏర్పాట్లు చేశామని ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కోరుకొల్లు, కలిదిండి, గుర్వాయిపాలెం, పోతుమర్రు, పెదలంక, మూల్లంక గ్రామాల్లో రామాలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు.

మా రామయ్య సుగుణాల సంపన్నుడు..

చనుబండలో ఆకట్టుకున్న ఎదుర్కోలు ఉత్సవం

చాట్రాయి, ఏప్రిల్ 16: అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎదుర్కో లు ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ వంశపారం పర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతుల ఆధ్వ ర్యంలో జనక మహారాజు తరఫున పెళ్ళి పెద్దలు, దశరథ మహారాజు తరపు పెళ్ళి పెద్దలు, సీతాదేవిని రాములవారిని తీసుకొని మంగళ వాయిద్యాలతో బయలుదేరి ఆర్యవైశ్య ప్రముఖుడు జల్లేపల్లి మురళీకృష్ణ ఇంటికి చేరుకొని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దశరథ మహారాజు తరపు పెద్దలు 'మా రామయ్య పురుషోత్తముడు, సుగుణాల సంపన్నుడు, సత్యవాక్కు పరిపాలకుడు.. అంత గొప్పవాడిని అల్లుడిగా పొందటం మీ అదృష్టం' అనగా, మా సీతమ్మ అం దాలరాశి, సాక్షాత్ లక్ష్మీదేవి' అం టూ హాస్య ధోరణిలో సంభాషించుకున్నారు. అనం తరం పెళ్ళి సంబంధం ఖాయం చేసుకొని లగ్నపత్రికలు మార్చుకున్నారు. ఈ మధుర ఘట్టాలను గ్రామస్థులు భక్తిభావంతో తిలకించారు. జై శ్రీరామ్ నామస్మరణ చేశారు.

పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలి

ముసునూరు, ఏప్రిల్ 15: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చేందుకు నీటిని అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ముసునూరు, చింతలవల్లి, గోపవరం తదితర గ్రామాల్లోని నీటి తొట్టెలను ఆమె పరిశీలించి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి తొట్టెల్లో నీటిని సమృద్ధిగా ఉంచాలని, మంచినీటి కుండీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బలివే పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలపై ఎంపీఈడీవో అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16: కృష్ణా జిల్లా అండర్-18 జూనియర్ బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నూజివీడు బెతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు 80 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారని కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు నూజివీడు బీఐఎస్ సీబీఎస్ఈ స్కూల్‌లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16: ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులకు నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలో అంతర్భాగంగా నడుపుతున్న నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు వివిధ కళాశాలల నుంచి హాజరైన 39 మంది విద్యార్థులకు రాతపరీక్ష అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగాలు పొందిన విద్యార్థులు రైతులకు సూచనలు సలహాలు ఇస్తూ వారి అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నూజివీడు టౌన్ ఏప్రిల్ 16: ఆయిల్ సంబంధ అగ్ని ప్రమాదాలను ఫోమ్‌ను ఉపయోగించి నివారించవచ్చునని నూజివీడు ఫైర్ ఆఫీసర్ కేవీఈ విశ్వనాథ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా స్థానిక సారధి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ గ్యాస్ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు కార్బన్‌డయాక్సైడ్ ఉపయోగించాలన్నారు. వాటర్ గన్‌తో పరిశ్రమలు, గోదాముల్లో అగ్ని ప్రమాదాలు ఎలా నివారిస్తారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్ఎఫ్‌డి ముత్తయ్య, ఫైర్ సిబ్బంది సురేష్‌బాబు, ప్రసాద్, నాంచారయ్య భాస్కరరావు, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కైకలూరు, ఏప్రిల్ 16: ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షులు తుపాకుల సోమాచారి తెలిపారు. మంగళవారం కైకలూరు నీలం సంజీవరెడ్డి వారపు సంత వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ దాతలు విరాళాలతో చలివేంద్రాన్ని నడుపుతున్నామన్నారు. యానాల బసవయ్య, దేవరపల్లి శర్మ, అంబవరపు శ్రీను, ఆముదాలపల్లి వీరబ్రహ్మం, దివిలి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పది మంది వలంటీర్ల రాజీనామా

ముసునూరు, ఏప్రిల్ 15: మంగళవారం 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వేల్పుచర్లకు చెందిన ఆరుగురు, కాట్రేనిపాడు ఒకరు, సూరేపల్లి ఒకరు, ముసునూరు సచివాలయ-2 పరిధిలో ఇద్దరు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవికి అందజేశారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉన్న 300 మంది వలంటీర్లకుగాను 234 మంది ఇప్పటి వరకు రాజీనామా చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి : డీఈవో



కలిదిండి, ఏప్రిల్ 16 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆవకూరు, పేట కలిదిండి ప్రాథ మిక పాఠశాలల్లో నిర్వహించిన స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలను పరిశీలించారు. అనంతరం కొండంగి, మట్టగుంట, పెదలంక, గోపాలపురం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులు వెనుకబడిన అంశాలు, రాబోయే సంవత్సరంలో అవలంబించవలసిన విద్యాపరమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌బాబు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆగిరిపల్లి మండలంలో ముద్దరబోయిన ప్రచారం

కార్యకర్తల అండతో గెలవబోతున్నా

ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 16: నిజమైన టీడీపీ కార్యకర్తలు తన వెంటే ఉన్నారని వారి అండ దండలతోనే నూజివీడు స్వతంత్ర అభ్యర్థిగా గెలువబోతున్నానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి, తోటపల్లి, సింగన్నగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత, నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్ మార్పుతో టీడీపీలో ఉన్న అసంతృప్తి తన గెలుపునకు కారణం అవుతున్నాయన్నారు. ఈ నెల 18న నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేస్తున్నానని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముద్దరబోయిన కోరారు. ఆయా గ్రామాల ముద్దరబోయిన అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రేపు కాపు ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 16: కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఈ నెల 18న కాపు ఆత్మీయ సమావేశం నిర్వహించ నున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో నిర్వహించే సమావేశానికి టీడీపీ నేత వంగవీటి రాధా ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామం నుంచి వంగవీటి రాధాతో కలసి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. కైకలూరు పట్టణంలో రోడ్‌షో ఉంటుందని, కూటమి అభ్యర్థులైన కామినేని శ్రీనివాస్, పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ రోడ్‌షోలో పాల్గొంటారన్నారు. అనంతరం ఆత్మీయ సమావేశం జరుగుతుందని, కాపు నేతలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.


కైకలూరులో గౌడ సంఘ ఆత్మీయ సమావేశంలో పుట్టా మహేష్ యాదవ్

రైతుకు నీరు.. యువతకు ఉద్యోగం

- మా లక్ష్యాలు, ఆకాంక్షలు ఇవే..
- అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యం
- మీలో ఒకడిగా నేను..
- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ వినూత్నశైలి

ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఏప్రిల్ 16: రాజకీయాలకు కొత్త అయినా వ్యవహార శైలిలో మాత్రం సరికొత్త ఒరవడితో టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థిగా అందరి సహకారం, సరికొత్త ఎత్తుగడలతో మహేష్ యాదవ్ ప్రజల వద్దకు వెళుతున్నారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యలను నేరుగా పరిగణనలోనికి తీసుకుని ఎక్కడైతే సమస్య ఉందో గుర్తించి సంబంధికులతో నేరుగా భేటీ అవుతున్నారు. వారి సలహాలు సూచనలతో పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో ఆత్మీయ సమావేశాలు, సామాజిక సమావేశాలు, రైతు సమస్యలపై చర్చలు సాగించారు. ఆయా సమస్యలపై చురుకైన పనితనంతో మహేష్ యాదవ్ సమయానుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఏలూరు లోక్ సభ నియోజకవర్గం నుంచి తొలి సారిగా పోటీ చేస్తున్న ఆయన ఈ రెండు వారాల్లో మెరుగైన అవగాహన తెచ్చుకున్నారు. దీనికి అనుగుణంగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి వీలుగానే ఇంతకుముందు ఈ ప్రాజెక్టు పరిధిలో తానుకొంత చేయూతనిచ్చిన విషయం గమనించి ఆమేరకే ఏలూరు ఎంపీగా రంగంలో దింపిన విషయాన్ని ఆయన పదే పదే గుర్తు చేస్తున్నారు. సమస్యలపై అవగాహన ఉంది.. పరిష్కారంకోసం అన్వేషించే ధైర్యం ఉంది. సంకల్ప సిద్ధిలో అనుభవం ఉంది. ఇక ప్రజల తోడ్పాటు ఉంటే తాను తిరుగులేని అభివృద్ధి చేసి చూపిస్తాననే ధీమాతోనే మహేష్ యాదవ్ ఉన్నట్లు ఆయన అనుచరులు, పార్టీ వర్గాలు ప్రజలకు వివరించే పనిలో పడ్డాయి. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో 2 అసెంబ్లీ స్థానాలు జనసేనకు, ఒకటి బీజేపీకి కేటాయించడంతో అందరికీ స్నేహితుడిగా పదునైన రాజకీయాలకు వ్యూహాలు పన్నుతున్నారు. ఇన్‌ఫ్రా కంపెని బాధ్యతలతో తన కొంత రాటుదేలినట్లు, సమాంతరంగా అనుభవం సాధించినట్లు పోలవరం, చింతలపూడి, ఎత్తిపోతల పథకంలో ఈ అనుభవం తనకు నూరుశాతం స్ఫూర్తిదాయకమని యాదవ్ భావించారు. ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యలను ప్రస్తావిస్తూ ఏలూరు ఎంపీ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సరికొత్త పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టారు. ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో ముఖ్యులు, స్నేహితుల సహకారంతో పరిశ్రమలు తీసుకువస్తానని, తద్వారా ఉద్యోగాల కొరత తీరుస్తానని ఇప్పటికే ఆయన ధీమాతో ఉన్నారు. ప్రత్యేకించి మెట్ట ప్రాంత రైతులకు సాగునీటి కల్పనలో తనను గెలిపిస్తే సాగునీరు, అభివృద్ధి చేసి చూపిస్తానన్నదే ఆయన మాటగా వినిపిస్తుంది. ఇదే విషయ్నాన టీడీపీ, జనసేన, బీజేపీ కూడా నేరుగా ప్రస్తావిస్తున్నాయి.

తాగునీటి గండం!

అడుగంటిన పోలరాజ్ కెనాల్...శివారు గ్రామాలకు అందని నీరు

కలిదిండి, ఏప్రిల్ 16 : కలిదిండి మండలంలో పోలరాజ్ కెనాల్‌కు అర కొరగా తాగునీరు విడుదల చేయడంతో అడుగంటింది. సుమారు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఇంతవరకు పోలరాజ్ కెనాల్‌కు తాగునీరు సరఫరా కాలేదు. దీంతో తాగునీటి చెరువులను ఏ విధంగా నింపుకోవాలని సర్పం చ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాగునీటి ఎద్దడి తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతెగలపాడు, కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాల్లో తాగునీటి చెరు వులను నింపుకోవడానికి తాగునీటి వంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 10న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కలిదిండి సందర్శించి ఆరుతెగలపాడు వద్ద అడుగంటిన పోలరాజ్ కెనాల్‌ను పరిశీలించారు. పోలరాజ్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసి ఆయా గ్రామాల్లో అడుగంటిన చెరువులను నింపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినా ఇంత వరకు అరకొరగా సరఫరా చేయడంతో శివారు గ్రామాలకు నీరు చేరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి సమృద్ధిగా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.


కలిదిండి మండలంలో అడుగంటిన పోలరాజ్ కెనాల్

టీడీపీలో బీసీల సంక్షేమానికి పెద్దపీట


కామినేనికి మద్దతు తెలుపుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

కైకలూరు, ఏప్రిల్ 16: బీసీలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చింది టీడీపీ అని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ అన్నారు. మంగళవారం కైకలూరులో నియోజ కవర్గ గౌడ, శెట్టి బలిజ ఆత్మీయ సమావేశాన్ని గౌడ సంఘ నాయకుడు బొర్ర చలమయ్య అధ్యక్షతన నిర్వహించారు. కొనకళ్ల ముఖ్యఅతిథిగా మాట్లాడు తూ జగన్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోకపోతే భావి తరాలకు మనుగడ ఉండదని గౌడ, శెట్టిబలిజ కులస్థులంతా కామినేని, పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కామినేని మాట్లాడుతూ కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు నిషేధిత క్యాట్‌ఫిష్ పెంచి అమ్మకాలు జరిపి కోట్లలో సంపాదించా డన్నారు. 2014 ఎన్నికల్లో గౌడ కులానికి చెందిన ఉప్పాల రాంప్రసాద్‌పై తాను పోటీ చేశానని ఆ సమయంలో రాంప్రసాద్‌కు దూలం వెన్నుపోటు పొడిచారని దీనిపై తాను ఏ గుడిలోనైనా ప్రమాణం చేస్తానని సవాల్ విసిరారు. ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ గౌడ కమ్యూనిటీ హాలు నిర్మాణం, ద్వారకా తిరుమలలో గౌడ కల్యాణ మండపానికై కృషి చేస్తాన న్నారు. జగన్ పెద్ద డ్రామా ఆర్టిస్ట్ అన్నారు. 300 మంది యువత ఎన్డీయే కూటమిలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీలు బండి లక్ష్మీ, వీరమల్లు నరసింహారావు, బొర్రా సత్యనారాయణ, వీరంకి వెంకయ్య, కట్టా వీరరాఘవులు, పరసా ఏడుకొండలు, పోసిన పాపారావుగౌడ్ పాల్గొన్నారు. మంగళవారం కామినేని నివాసంలో కలిదిండి, ముదినేపల్లి మండలాల జనసేన నాయకులు ఏఎన్ బాబు, కాళ్ళపాలెం బుజ్జి ఆధ్వర్యంలో 500 మంది కామినేనికి మద్దతు తెలిపారు. ముదినేపల్లి మండలం సింగరా యపాలెం నుంచి 500 మంది యువత బైక్‌లపై ర్యాలీగా తరలివచ్చి మద్దతు ఇచ్చారు. కామినేని బంధువులు మంగళవారం కైకలూరు-ఏలూరు రోడ్డులో ఇంటింటికి తిరుగుతూ కామినేని, మహేష్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.

కలిదిండి: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కూటమితోనే సాధ్యమని కైకలూ రు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలిదిండిలో నియోజకవర్గ నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బార్బర్ షాపులకు విద్యుత్ రాయితీ వర్తించేలా కృషి చేస్తానని, ప్రముఖ ఆలయాల్లో నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిస్తామని తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు లంకా రత్నారావు, అధ్య క్షుడు కొత్తపల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు. కలిదిండి మండలంలో కామినేని ఎన్నికల ప్రచారం చేశారు. ఆక్వా రంగం లాభాల బాటలో పయనించేలా కేంద్రం సాయంతో తన వంతు కృషి చేస్తానన్నారు.

టిడ్కో ఇళ్ళు ఉచితంగా ఇస్తామని వంచన : కొలుసు


ఆత్మీయ సమావేశంలో పార్థసారథి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16: ఉచితంగా టిడ్కో ఇళ్ళు ఇస్తామని నమ్మించి వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులను నయవంచనకు గురి చేసిందని నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి ధ్వజమెత్తారు. నూజివీడు పట్టణంలో మంగళవారం పలు వార్డులలో జరిగిన ఆత్మీయ సమావేశాలలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం 70 శాతం పనులు పూర్తి చేసిన టిడ్కో గృహాలను పూర్తి ఉచితంగా ఇస్తానని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి ఆ హామీని నిలబెట్టుకోకుండా మోసం చేశారని, చివరికి లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని వారిని అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. వచ్చేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమేనని నూజివీడు ఎమ్మెల్యేగా గెలిచి టిడ్కో గృహాలను 6 నెలలలో లబ్ధిదారులకు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆత్మీయ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.